www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 20 జూన్ 2025

నేడు ఎమ్మెల్యే ఆఫీసులో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక లక్ష్మీ నగర్ కాలనీలోని చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో 20వ తేదీ శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ప్రజలు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని జత చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

అన్నదాత సుఖీభవ

- నేడు రైతుల ఖాతాలకు తొలి విడత నగదు జమ
- జిల్లాలో 1,45,255 మంది ఎంపిక
- రెవెన్యూ సమస్యలతో 16వేల మందికి కోత
- రీ సర్వేలో జాయింట్ 'ఎల్‌పిఎం'తోనే చిక్కులు

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)

అన్నదాత సుఖీభవ పథకంకు కూటమి సర్కార్ నేడు తొలి విడత నగదు జమ చేయనుంది. చిత్తూరు జిల్లాలో సూపర్ సిక్స్ పథకంలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకానికి 1,45,255 మందిని ఎంపిక చేశారు. రియల్ టైం గవర్నెన్స్ ద్వారా తుది జాబితా విడుదల చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఎంపికైన లబ్ధిదారులు చేపట్టిన ఈ కేవైసీలో 1,39,969 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు.

పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకానికి ఏటా రైతులకు రూ.20వేలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు అందించనున్నాయి. కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో రూ.2వేలు చొప్పున రూ.6వేలు జమ చేస్తుంది. రూ.5వేల చొప్పున మూడో విడత రూ.4వేలు చొప్పున సాయం అందించనుంది. తొలివిడత ఈనెల 20న పీఎం కిసాన్ రూ.2వేలు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేలు చొప్పున మొత్తం ఎంపిక చేసిన రైతులకు రూ.7వేల నగదు జమ చేయనున్నారు.

అన్నదాత సుఖీభవకు రెవెన్యూ సమస్యలు..

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకంలో భాగంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి గత ప్రభుత్వం చేసిన రీసర్వే రెవెన్యూ సమస్యలతో కొంతమంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి చిత్తూరు జిల్లాలో అనర్హులుగా మిగిలిపోతున్నారు. గతంలో వైయస్సార్ ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వేలో సాంకేతిక చిక్కులు తెచ్చిపెడుతుంది. ఆధార్ అనుసంధానంతో తప్పులు, మోటివేషన్లు, మృతుల పేర్లతో విస్తీర్ణం ఉండటం, 1బి లు రాకపోవడం తహాశీల్దార్ డిజిటల్ సంతకం లేకపోవడం వంటి సమస్యలతో అర్హుల జాబితా ఎంపిక గడువు పూర్తి అయినప్పటికీ రెవెన్యూ లాగిన్‌లో మరో 16వేల మంది వివరాలు అసంపూర్తిగానే ఉన్నాయి. వీరందరికీ అన్నదాత సుఖీభవ పథకం పూర్తిస్థాయిలో అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

రీ సర్వే జాయింట్ ఎల్‌పిఎం నెంబరుతో చిక్కులు..

గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే తప్పిదాలతో రైతులకు శాపంగా మారింది. ప్రధానంగా (ల్యాండ్ పార్సిల్ మ్యాప్), ఎల్‌పిఎం వెబ్ ల్యాండ్‌లో సమస్యలు ఎదురవుతున్నాయి. రీసర్వేలో ఐదు, ఆరుగురు రైతులకు కలిపి ఒకే ఎల్‌పిఎం కేటాయించడంతో సమస్య తలెత్తింది. దీనివలన పంట రుణాలకే కాదు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏది గాని రైతులుకి అందడం లేదు. అన్నదాత సుఖీభవ పథక లబ్ధిదారుల వివరాలు మరింత పారదర్శకంగా ఉండాలని రైతు సేవా కేంద్రాలకు వెబ్ లాండ్‌ను మండల వ్యవసాయ అధికారులు లాగిన్లకు అందజేశారు. జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి అయినప్పటికీ సుమారు 16 వేల మంది వివరాలు తహాశీల్దార్ లాగిన్‌లో వివిధ సమస్యలతో పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఇబ్బంది ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి

జిల్లాలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు వారి భూములను విభజన చేయుటకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.500ల రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితంగా ఈ సేవను పొందుటకు అవకాశం కల్పిస్తున్నాం. దీనికి గాను కేవలం నామమాత్రపు దరఖాస్తు రుసుం రూ.50లను గ్రామ సచివాలయాల్లో చెల్లించి ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవల్సిందిగా కోరుతున్నాం. ఈ అవకాశాన్ని జాయింట్ పట్టాదారులందరూ ఉపయోగించుకొని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించుకోవాలి. దీనివలన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించబడతారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఇబ్బంది వున్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

ధర లేక.. అమ్ముకోలేక..

- రోడ్డు పాలవుతున్న మామిడి
- నిండా నష్టపోతున్న రైతన్నలు

ప్రజాశక్తి- సోమల

మామిడి పంట పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేక నష్టాలు చవిచూస్తున్న వేళ పండిన పంటను ఏమిచేయాలో దిక్కుతోచని పరిస్థితులలో నష్టానికైనా అమ్ముకుందామని ట్రాక్టర్లలో టెంపులలో వేసుకుని మండీల వద్దకు వస్తున్నారు. తీరా మండీల వద్ద వ్యాపారులు ఎవరూ కొనడానికి అంగీకరించకపోవడంతో చేసేదేమీ లేక మామిడి కాయలను రోడ్డుపాలు చేసి చమర్చిన కళ్ళతో తిరిగి ఇంటికి చేరుతున్నారు. ఇటువంటి సంఘటన గురువారం సోమల- సదుం మార్గంలో అభయ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. మామిడి రైతులు కోసి ట్రాక్టర్‌లో అమ్ముకోవడానికి తెచ్చిన కాయలను ధరలేక తిరిగి తీసుకుని వెళ్లలేక రోడ్డుపక్కన పారబోశారు. మండలంలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. ఈ ఏడాది పంట కూడా బాగా రావడంతో ధరలు ఆశించినంత మేర ఉండి పంట అమ్మి లాభాలు అర్జించవచ్చునని రైతు ఎంతో ఆశపడ్డాడు. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో పక్వానికి వచ్చిన కాయలు కోయాలా.. అమ్ముకోవాలా.. అలాగే తోటలో వదిలివేయాలి తెలియని పరిస్థితులలో మామిడి రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. అయిన సరే వచ్చిన కాడికి అమ్ముదామని మామిడి కాయలను కోసి ట్రాక్టర్‌లో మండీలకు తీసుకువస్తే అక్కడి వ్యాపారులు చెప్పే ధరలు, నిబంధనలను జీర్ణించుకోలేక, తిరిగి కాయలు ఇంటికి చేర్చలేక కష్టపడి పండించిన మామిడి కాయలను రోడ్డుపక్కన, అటవీ సమీప ప్రాంతాల్లో పారబోస్తున్నారు

సోమల- సదుం మార్గంలో అభయ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మామిడి కాయలను రోడ్డు పక్కన పోసిన దృశ్యం

ప్రభుత్వ సబ్సిడీ రూ.4 అందిస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: జిల్లాలో పండే మామిడికి చిట్టచివరి కాయ అమ్ముడుపోయే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రభుత్వం అందించే రూ.4లు మద్దతు ధర సబ్సిడీ రూపంలో రైతు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు జమ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్‌లో మామిడి మండి యాజమానులు, రైతులతో మామిడి మద్దతు ధరపై జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తోతాపురి మామిడిని చివరి కేజీ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మండలాల్లో గ్రామసభల ద్వారా మామిడి అమ్మకంపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ట్రేడర్స్ పైన ఆధార పడవద్దు అని, చిన్న సన్నకారు మామిడికాయ రైతులు పక్వానికి వచ్చిన మామిడికాయలని కంపెనీలకు తరలించాలని రైతులకు పిలుపునిచ్చారు. జిల్లాలో మామిడి పండించే రైతులు ఎటువంటి ఇబ్బంది పడకూడదని, ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ప్రతి రైతుకు కేజీకి రూ.4 చొప్పున వారికి మద్దతు ధర ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిఓను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం వారు అందించే రూ.4ల మద్దతు ధర ఆగిపోతుందనే అపోహ వలన ఎక్కువ మంది రైతులు పంటని కోత చేసి త్వరగా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారని, పల్ప్ యూనిట్ స్టోరేజ్ సామర్థ్యం, ప్రాసెసింగ్ సామర్థ్యానికి మించి తీసుకెళ్తే అక్కడ వెయిటింగ్ టైమ్ పెరుగుతుందన్నారు. దానిని నివారించడానికి మామిడి రైతులందరూ నెమ్మదిగా పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే తీసుకురావాలని, ఆగస్టు మొదటి వారం వరకు చివరి కాయవరకు ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా ఏపి రైతు పంట ఎప్పుడు కోతకు వస్తుందో నిర్ణయించి వాటిని వ్యాపారులతో అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటివరకు వివిధ ఫ్యాక్టరీలలో 60వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయని జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఫ్యాక్టరీలు రాంపులు వద్ద ధరలు పట్టిక తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరం, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, తహాశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, ఏవో భారతి, ఏఎంసీ కార్యదర్శులు రమణ, సంజీవి కుమార్, రైతులు పాల్గొన్నారు.

రైతులు, గుజ్జు పరిశ్రమల యాజమాన్యంతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

మామిడి రైతులకు నష్టం వాటిల్లకుండా
చివరి కేజీ వరకు కొనుగోలు: జెసి

ప్రజాశక్తి- బంగారుపాలెం: మామిడి రైతులకు నష్టం వాటిల్లకుండా చివరి కేజీవరకు మామిడి కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. గురువారం బంగారుపాలెం మండలం నలగాంపల్లి గ్రామంలోని సన్ గోల్డ్ గుజ్జు పరిశ్రమను జాయింట్ కలెక్టర్ సందర్శించి మామిడి రైతులకు టోకెన్‌ల మంజూరు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తోతాపురి మామిడిని చివరి కేజీ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు ఆందోళన చెంది పక్వానికి రాక మునుపే మామిడి కాయలను గుజ్జు పరిశ్రమలకు తరలించవద్దని సూచించారు. మండలాల్లో గ్రామ సభల ద్వారా మామిడి అమ్మకం పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మామిడి రైతులకు సలహాలు, సూచనల కొరకు ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద షిఫ్ట్‌ల వారీగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు. మామిడి రైతుల సందేహాలు నివృత్తికి హెల్ప్ లైన్ నెంబర్ 08572-242777, 9491077325లకు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

మామిడి రైతులతో మాట్లాడుతున్న జెసి విద్యాధరి

మద్దతు ధర చెల్లించకుంటే కఠిన చర్యలు: కలెక్టర్

జైన్ ఫ్యాక్టరీలో కంపెనీ ప్రతినిధులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: తోతాపురి మామిడిపై మద్దతు ధరకన్నా తక్కువ చెల్లించేవారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. గురువారం గంగాధర నెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీని, గుడిపాల ఆర్ఎంఎం ఫ్యాక్టరీని జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి మామిడి కాయల కొనుగోలుపై పరిశ్రమ యాజమాన్యం, రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు తోతాపురి మామిడ కాయలకు మద్దతు ధర చెల్లించాలని, ట్రేడర్లు, రైతులను ఇబ్బందికి గురి చేయవద్దని తెలిపారు. మద్దతు ధర కంటే తక్కువ చెల్లిస్తే చర్యలు తీసుకుంటామన్నాడు. గుజు పరిశ్రమలకు మామిడికాయలను తెచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, తాగునీరు, భోజనం, కల్పించాలని ఎమ్మార్వోలను, ఎంపీడీవోలను ఆదేశించారు. జిల్లాలో మామిడి పంట ఉత్పత్తికన్నా ఎక్కువగా ఉన్న కారణంగా ప్యాకింగ్ మెటీరియల్‌ను సమకూర్చుకుని ప్రాసెసింగ్ యూనిట్ల కెపాసిటీని పెంచుకోవాలని సూచించారు. మామిడి కాయలు కొనుగోలు చేసిన యాజమాన్యం సకాలంలో రైతులకు రావాల్సిన డబ్బులను అందించాలన్నారు. ధరల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలన్నారు. సీరియల్ నెంబర్ ప్రకారమే లోడ్ ఉన్న రైతులకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు టోకెన్ పద్ధతి కచ్చితంగా అమలు చేయుచున్నామని తెలిపారు. రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా చివరి కేజీ వరకు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మండలాల్లో తహసీల్దార్లు, ఉద్యాన అధికారులు మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రేపు 5,508 ప్రాంతాల్లో యోగా దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని 5, 508 ప్రదేశాలలో ఈనెల 21వ తేదీ శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి యోగేంద్ర కార్యక్రమాలపై ముందుస్తు ఏర్పాట్లపై జిల్లా అధికారులు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జిల్లా యోగేంద్ర కార్యక్రమాలపై పలు సూచనలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు చేసుకునే విధంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లందరికీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారన్నారు. ఆప్రకారం జిల్లాలోని 5508 ప్రదేశాలలో ఈనెల 21వ తేదీన ప్రభుత్వం నిర్దేశించిన యోగా ప్రోటోకాల్‌ను నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో యోగా కార్యక్రమం తప్పనిసరిగా జరగాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న పౌరులందరూ పాల్గొనేలా చొరవ చూపాలని, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో, శిక్షణా తరగతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. గుర్తించిన యోగ నిర్వహణ ప్రదేశాల వద్ద వేదిక, కార్పెట్, పిఏ సిస్టం, బ్యానర్లు సిద్ధం చేసుకోవాలని, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రథమ చికిత్స కోసం వైద్య శిబిరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. యోగా కార్యక్రమం నిర్వహించిన తర్వాత అందుకు సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్త వహించాలన్నారు.

మేనరికపు వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీస్ భారతి ఆధ్వర్యంలో గురువారం మానసిక వికలాంగులకు న్యాయపరమైన సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లీగల్ సెల్ అథారిటీస్ భారతి మాట్లాడుతూ ఉచిత న్యాయసేవలు, అవసరమైన వారికి ఆర్థిక సహాయం పునరావాస కేంద్రాలకు తరలించుట, హక్కులపై అవగాహన కల్పించారు. అలాగే డిఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి మాట్లాడుతూ మేనరికపు వివాహాలు, వాటివలన జరిగే అనర్థాలను గురించి వివరించారు. మానసిక వ్యాధిగ్రస్తులకు ఎన్టీఆర్ భరోసా కింద రూ.6వేలు పింఛన్ ఇవ్వబడుతుందని తెలిపారు. డిసిహెచ్ఎస్ పద్మాంజలి మాట్లాడుతూ గర్భవతిగా ఉన్న కాలంలో ప్రతి ఒక్కరు మానసిక పరీక్షలు చేయించుకోవాలన్నారు. మానసిక వైద్యులు డాక్టర్ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ చిన్నపిల్లల్లో వచ్చే మానసిక రుగ్మతల గురించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ ఉష పుట్టుకతో వచ్చే లోపాలు గురించి వివరించారు. డాక్టర్ల లత గర్భస్థ సమయంలో బాలింత సమయంలో ఎలాంటి మానసిక ఆందోళనకు గురికాకుండా మంచి పోషకాహారం తీసుకుంటూ మానసిక ప్రశాంతతతో ఉండాలన్నారు. సిడిపిఓ శ్యామల మాట్లాడుతూ అంగన్వాడీలలో మానసిక సమస్యల పిల్లలను గుర్తించి సమస్యల నివృత్తికి మెంటలీ రిహాబిటేషన్ సెంటర్‌కు పంపుతున్నామన్నారు. కావున గ్రామీణ ప్రాంతంలో పనిచేస్తున్న అంగన్వాడీలు, ఆశాలు ఏఎన్ఎంలు తమ పరిధిలో మానసిక సమస్యలున్న పిల్లలను గుర్తించి రిహాబిటేషన్ సెంటర్కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరి, యూపీహెచ్సీ డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

మా స్కూల్ మార్చొద్దు..

- యనమలమందలో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని యనమలమంద గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను అలాగే కొనసాగించాలని, మా స్కూల్ మాకే కావాలంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం స్కూల్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ యుపిఎస్ స్కూల్‌ను మళ్లీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇక్కడున్న స్కూల్‌లోని విద్యార్థులను జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్‌కు మార్పు చేసి అక్కడే విద్యార్థులను పంపాలని చెప్పడం దారుణమన్నారు. ఆ స్కూల్‌కి వెళ్లాలంటే అటవీ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల మేర వెళ్లాలని నడవాలని, రవాణా సౌకర్యం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ పాఠశాల ఎనిమిదో తరగతి వరకు ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఐదో తరగతి వరకు మాత్రమే నిర్వహిస్తామని మిగిలిన విద్యార్థులు జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్‌కి తరలించడం వలన విద్యార్థులు అవస్థలు పడతారని వాపోయారు. తమ గ్రామంలోని స్కూల్‌లో ఇదివరకు లాగా 8వ తరగతి వరకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎంఈవో దాము మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చెప్పిన సమస్యలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

మామిడి రైతులకు అవగాహన కల్పించేది ఇలాగేనా..?

- దారిన పోయే వారితో గ్రామసభల నిర్వహణ..

ప్రజాశక్తి- సోమల: తాము పండించిన మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక అమ్ముకోలేక నష్టాలను చవిచూస్తున్న రైతుకు అండగా నిలిచి గిట్టుబాటు ధర కల్పించి వారికి అవగాహన కల్పించేందుకు ఉద్యానశాఖ, మండల అభివృద్ధి శాఖ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో మండలంలోని 15 పంచాయతీల పరిధిలో గ్రామసభల షెడ్యూల్ సిద్ధం చేశారు. అయితే ఎప్పుడు ఏ సచివాలయంలో రైతులకు అవగాహన కల్పిస్తారన్న విషయాన్ని పత్రిక ముఖంగా గాని కనీసం సచివాలయ సిబ్బందికి కానీ రైతులకు గాని తెలియజేయలేదు. దీంతో అప్పటికప్పుడు సమావేశం ఏర్పాటు చేయడం దారినపోయే వారిని పిలిపించి కూర్చోపెట్టి అవగాహన కల్పించినట్టు మమా అనిపిస్తున్నారు. 18, 19, 20 తేదీలలో నిర్ణయించిన సమయంలో కేటాయించిన సచివాలయంలో రైతులకు అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ సిద్ధం చేసినా బహిర్గత పరచకపోవడం వల్ల ప్రభుత్వం ఆశించిన విధంగా క్షేత్రస్థాయిలో లక్ష్యాలను చేరుకోకపోవడం కారణంగా రైతులు నష్టపోతున్నారు. అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ ఆశయాన్ని పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేటప్పుడు ప్రచారం నిర్వహించి ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు దృష్టి సారిస్తారని ఆశిద్దాం.

బహిర్గతం కానీ షెడ్యూల్

GRAMA SABHA SCHEDULE ON MANGO STAGGERED HARVESTING

S.NO	NAME OF THE MANDAL	NAME OF THE GRAMAPANCHAYATH	TIME OF CONDUCT	DATE OF CONDUCT	TEAM
1	SOMALA	THAMMINAYANIPALLI	MORNING	18-06-2025	MRO & MAO
2	SOMALA	VALIGATLA	MORNING	18-06-2025	MPDO & APO NREGS
3	SOMALA	NELLIMANDA	AFTERNNOON	18-06-2025	MRO & MAO
4	SOMALA	KANDURU	AFTERNNOON	18-06-2025	MPDO & APO NREGS
5	SOMALA	IRIKIPENTA	MORNING	19-06-2025	MRO & MAO
6	SOMALA	SOMALA-1&2	MORNING	19-06-2025	MPDO & APO NREGS
7	SOMALA	NANJAMPETA	AFTERNNOON	19-06-2025	MRO & MAO
8	SOMALA	PODALAKUNTAPALLI	AFTERNNOON	19-06-2025	MPDO & APO NREGS
9	SOMALA	AVULAPALLI	MORNING	20-06-2025	MRO & MAO
10	SOMALA	ANNEMMAGARIPALLI	MORNING	20-06-2025	MPDO & APO NREGS
11	SOMALA	PEDDAUPPARAPALLI	AFTERNNOON	20-06-2025	MRO & MAO
12	SOMALA	81 UPPARAPALLI	AFTERNNOON	20-06-2025	MPDO & APO NREGS

గురుకుల ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి గాను 6, 7, 8, 9 తరగతులో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బాలుర పాఠశాలలో రామకుప్పం, పూతలపట్టు, విజలాపురం బాలికల పాఠశాలలు చిత్తూరు, పలమనేరు, జీడి నెల్లూరు, కుప్పం మిగిలిన సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులో మిగిలిన సీట్లకు విద్యార్థులు ఆయా విద్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈనెల 25వ తేదీ ఉదయం 10 నుండి 11 గంటల వరకు చిత్తూరులోని బాలికల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధి శిక్షణ విభాగం ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళా అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మోహన మురళి తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డిఆర్‌డిఏ సంయుక్తంగా ఈనెల 20వ తేదీ శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 17 కంపెనీలు వారు పాల్గొంటారని, అభ్యర్థుల కనీస అర్హత ఇంటర్, ఐటిఐ డిగ్రీ ఫెయిల్ లేదా పాస్ అయిన వారు, 18 నుంచి 35 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ స్త్రీ పురుషులు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం అబ్దుల్లా 81425 09017, లోకేష్ 99635 61755లను సంప్రదించాలని కోరారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ప్రభుత్వ పారిశ్రామిక (ఐటిఐ) శిక్షణ ప్రవేశం కొరకు రెండవ దశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.ఆనంద్ తెలిపారు. గురువారం ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటిఐలో విద్యనభ్యసించడానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జులై నెల 15వ తేదీ సాయంత్రం లోపు విద్యార్హత మార్కులిస్టు, అలాగే ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, పాస్ ఫోర్ట్ సైజ్ ఫోటోలతో ఐటీఐ కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు జులై 21వ తేదీ మెరిట్ ర్యాంకు ప్రకారం ఇంటర్వ్యూలు జరుగుతుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరై వారు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో కార్వేటినగరం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 916001 2999, 91609 60999 సంప్రదించలన్నారు.

'డయేరియా' వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

ప్రజాశక్తి- యాదమరి: చిన్నపిల్లల్లో డయేరియా వల్ల కలిగే నష్టాలను వివరించి వారు విరోచనాల భారిన పడకుండా చర్యలు తీసుకోవాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. గురువారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డయేరియా నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిహెచ్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిన్నపిల్లలు విరోచనాలు విరోచనాల భారినపడితే అస్వస్థత గురై ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని చిన్నపిల్లల తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 30వ తేదీ వరకు యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి చిన్నారుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా చిన్నారులు విరోచనాల భారినపడితే ఈఓఆర్ఎస్ తాగించడం, జింక్ టాబ్లెట్లు అందించాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సెల్వరాని, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

కలాం విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి- పుంగనూరు: భరతమాత ముద్దుబిడ్డ దేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు ఇస్తున్నారని కలాం హెల్త్ ఎడ్యుకేషనల్ చార్టిబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.అయూబ్ ఖాన్ చెప్పారు. పుంగనూరుకు చెందిన లయన్స్ త్రిమూర్తి రెడ్డి కలాం విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. త్రిమూర్తి రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటు గొప్పకార్యమని కొనియాడారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ కుల మత వర్గ రాజకీయాలకు సంబంధం లేకుండా అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటు దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పుంగనూరు: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జద్ బాష ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఇందిరా సర్కిల్‌లో కేక్ కట్ చేసి కార్యకర్తలకు, ప్రజలకు పంచిపెట్టారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ బలోపేతం కావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం అన్నారు.

చౌక దుకాణం ఏర్పాటు చేయండి..

తహశీల్దార్‌కు మహిళల విన్నపం

ప్రజాశక్తి- పూతలపట్టు: మండలపరిధిలోని బూసిపల్లి దళితవాడకు ప్రత్యేక చౌక దుకాణం ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన మహిళలు గురువారం తహశీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. 186 కార్డుల లబ్ధిదారులు ఉన్నందున గతంలో కోర్టు కూడా తమ గ్రామంలో చౌక దుకాణం ఏర్పాటు చేయాలని ఆర్డర్ ఇచ్చిందని, ఇందుకు సంబంధించి గతంలోని ఆర్డీవో కూడా చౌక దుకాణం ఏర్పాటు చేసే విధంగా అధికారులకు సూచించారుని, ఇంటి వద్దకే రేషన్ వస్తున్న కారణంగా పెద్దగా పట్టించుకోలేదని తెలిపారు. అయితే ప్రస్తుతం చౌక దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి ఉండగా ఇబ్బందికరంగా ఉందని, కోర్టు అనుమతుల ప్రకారం గ్రామంలో ప్రత్యేక చౌక దుకాణం ఏర్పాటు చేయాలని వారు విన్నవించుకున్నారు.

హైరోడ్డు విస్తరణలో ముందడుగు

కట్టమంచి వద్ద వంద అడుగుల సేకరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : నగరంలో హైరోడ్డు విస్తరణలో భాగంగా గురువారం కీలక ముందడుగు పడింది. ప్రైవేటు యజమానులను ఒప్పించి వంద అడుగుల మేర రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని సేకరించడం జరిగింది. నగరంలోని ప్రధానమైన హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రణాళిక విభాగం అధికారులు శుక్రవారం కట్టమంచి ప్రాంతంలో వెంకశ కళ్యాణ మండపం వద్ద వంద అడుగుల రోడ్డు వెడల్పు చేయడానికి అవసరమైన స్థలాన్ని సుమారు 200 అడుగుల పొడవుతో సేకరించడం జరిగింది. ఈ మేరకు ప్రహరీ గోడను తొలగించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించారు. ఇక్కడే మరికొన్ని ప్రైవేటు స్థలాల నుంచి రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని సేకరించి సదరు స్థలంలోని నిర్మాణాలను తొలగించారు. కార్యక్రమంలో టీబీపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళన చెందకండి..: ఎంపీడీవో

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని మాంబేడు, టీకేఎం పురం గ్రామాలలో మామిడికాయల కొనుగోలు కార్యక్రమంపై గురువారం ఎంపిడిఓ పురుషోత్తం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ మామిడి రైతులు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కాయల కొనుగోలు జరుగుతుందని, మార్పులు ఉండవని తెలిపారు. రైతులు మామిడి తోటల్లో పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోయాలని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి వనిత, రైతులు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పాడి పరిశ్రమ అభివృద్ధి చేసేందుకు రాయితీతో దానా పంపిణీ చేపడుతున్నట్టు జెడి ఆరిఫ్ అన్నారు. గురువారం మండలంలోని కాట్టప్పగారిపల్లి గ్రామంలో పశువైద్య సహాయకులు పవన్ ఆధ్వర్యంలో దానా పంపిణీ కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, పాడి పరిశ్రమలో అధిక లాభాలు చేకూర్చేందుకు ప్రభుత్వం నుండి 50శాతం రాయతీతో దానా పంపిణీ చేస్తున్నామని దీనిని ప్రతి ఒక్క పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జ్యూస్ ఫ్యాక్టరీ తనిఖీ చేసిన తహశీల్దార్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలం ఏబిసి ఫ్రూట్స్ అన్నూర్ యూనిట్ 4 జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతుల ఫిర్యాదు మేరకు జ్యూస్ ఫ్యాక్టరీని కార్వేటినగరం మండల తహశీల్దార్ నాగరాజు గురువారం తనిఖీ నిర్వహించారు. అనంతరం జ్యూస్ ఫ్యాక్టరీ మేనేజర్ వెంకటేష్, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు వరుస క్రమంలో టోకన్ తీసుకోవాలని, పక్వానికి వచ్చిన కాయలు మాత్రం కోసి తీసుకుని రావాలని రైతులకు సూచించారు. రైతులందరికీ న్యాయం జరుగుతుందని, ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ పూర్తి సామర్థ్యంతో క్రషింగ్ చేసి రైతుల్ని ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు నాగేశ్వరరాజు, నాయకులు, రైతులు ఉన్నారు.

ధర లేక మామిడి రైతులు విలవిల..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ధర లేక మామిడి రైతులు విలవిలలాడిపోతున్నారని వైసిపి రాష్ట్ర మొదలియార్ విభాగం అధ్యక్షులు జ్ఞాన జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని కోరారు. చంద్రబాబు నిర్లక్ష్యానికి.. రోడ్డుపై మామిడి రైతులు పడిగాపులు పడుతున్నారని, స్థానిక హయాత్ ఫుడ్స్ వద్ద మామిడి కాయల లోడ్ అన్లోడ్ చేయాలంటే స్థానిక దళారులు ఒక్కో బండికి రూ.700 నుంచి 800లు మామూలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి దిగుబడి ఈసారి ఎక్కువగా వస్తుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం వల్లే మామిడి రైతులకి ఇటువంటి పరిస్థితి నెలకొందని అన్నారు.

సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాలెం: సిఎం ఆదేశాలతో సైకిల్ పంపిణీ చేపట్టినట్టు తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ తెలిపారు. సీఎం కుప్పం పర్యటనలో సైకిల్ మంజూరు చేయాలని స్థానిక జండామాన్ వీధిలోని అంజాద్ బాష వినతిపత్రం సమర్పించారు. స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్ మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌కు సిఫార్సు చేశారు. గురువారం సాయంత్రం కలెక్టర్ చొరవతో తహశీల్దార్ అంజాద్ బాషకు సైకిల్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ డిటి బాబు, వీఆర్వో సునీల్ కుమార్, గోవిందయ్య, విజయ్ పాల్గొన్నారు.

సికిల్ సెల్ దినోత్సవంపై అవగాహన



చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాలతో జిల్లా సికెల్ సెల్ నోడల్ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ చిత్తూరు నగర పరిధిలోని గాయత్రీ నగర్‌లో గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ బాలికలతో ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ మూర్తి హాజరయ్యారు. ప్రతి సంవత్సరం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం కింద జూన్ 19న సికిల్ సెల్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరికీ రక్తపరీక్షలు నిర్వహించడం జరిగిందని, ఎవరికైనా ఈ వ్యాధి లక్షణాలు ఉన్నా, పాజిటివ్ వస్తే వారికి ప్రభుత్వం వారు రూ.10,000లు పెన్షన్ ఇస్తూ మంచి ఆహారం తీసుకునేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యూపీఎస్సీ సత్యనారాయణ పురం వైద్యాధికారి డాక్టర్ దయాసాగర్, ప్రిన్సిపల్ రేఖ, డిప్యూటీ హెచ్ఈఓ రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గంగవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పత్తికొండ ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొంగోళ్లపల్లి గ్రామంలో గురువారం డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సికిల్ సెల్ అనీమియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్ హాజరై మాట్లాడారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా పరీక్షలు చేస్తారని, ఈ వ్యాధికి వైద్యం కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు సరఫరా చేస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లహరి, సిహెచ్ఓ మనోరమాదేవి, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిపథ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో యువతకు అగ్నిపత్ పథకంపైన భారత వైమానిక దళం అధికారులు అవగాహన కల్పించారు. అగ్నివీర్ వాయు పథకంలో భాగంగా 17 నుండి 21 సంవత్సరాల లోపు ఉన్న యువత దీనికి అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ నుండి 12వ ఎయిర్మాన్ ఎలక్షన్ సెంటర్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కార్పోరల్ సందీప్, సురేంద్ర సింగ్ విచ్చేసారు. వారు మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా యువతకు లభించే అవకాశాలు, జీతం, సదుపాయాలు, స్కిల్ సర్టిఫికెట్ ఉపయోగాల గురించి తెలియజేశారు. 2022 నుండి ఈ పథకం అందుబాటులో ఉందని, సాయుధ దళాలలో పనిచేయాలనుకునే వారికి నాలుగు సంవత్సరాల పాటు అవకాశం కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు నగరంలోని 12 కళాశాలల నుండి విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కార్పోరల్ సందీప్

28,29 తేదీల్లో పురోహిత ధర్మ ప్రచారసభ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్ : కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న అర్చక, పురోహిత సంక్షేమ, అవగాహన ధర్మ ప్రచారసభను విజయవంతం చేయాలని చిత్తూరు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యాలయంలో చిత్తూరు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాణ్యం శ్రీనివాసశర్మ, సతీష్ కృష్ణమూర్తి, ఎంజీ రామభద్ర విలేకరులతో మాట్లాడారు. ఈనెల 28, 29 వ తేదీల్లో రెండు రోజుల పాటు తిరుపతి వినాయకనగర్ కంచి మఠం సమీపంలోని టీటీడీ ఫంక్షన్ హాలులో రాయలసీమ స్థాయి పురోహిత సంక్షేమ, అవగాహన ధర్మ ప్రచారసభ నిర్వహిస్తారన్నారు. ఈ అవగాహన సభకు ముఖ్యఅతిథులుగా శ్రీకంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు విజయేంద్రసరస్వతి స్వామితో పాటు, సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి హాజరవుతారని వెల్లడించారు. అర్చక, పురోహితులే కాకుండా కులాలు, మతాలకు అతీతంగా ప్రజలు సైతం అవగాహన సభకు హాజరు కావచ్చని తెలిపారు. సభకు హాజరయ్యే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నాయకులు విఠల్ దేవ్, జ్ఞానేశ్ శర్మ, విజయ రాఘవాచార్య పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రిన్సిపాల్‌ను సన్మానించిన విద్యార్థులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు పుంగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ కావడంతో గురువారం సోమల ప్రభుత్వ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగాధర నాయుడు మాట్లాడుతూ తన సొంత మండలంలో జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని బదిలీ కారణంగా కళాశాలను వీడి వెళుతున్నందుకు బాధగా ఉందని అన్నారు. తనను ఎంతో అభిమానంగా ఆదరించిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులు అధ్యాపక బృందంతో ఆయనను ఘనంగా సన్మానించి వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. కళాశాల చైర్మన్ కొల్లా కోటేశ్వర నాయుడు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్ ఇతర అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలి : తహశీల్దార్

ప్రజాశక్తి- పలమనేరు: రేషన్ కార్డుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని పలమనేరు తహశీల్దార్ ఇన్బనాథన్ ఆదేశించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో పట్టణ, మండల పరిధిలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ దుకాణాలు ఆథరైజేషన్ మేరకు ఎక్కడైతే కేటాయించారో ఆ చిరునామాలోనే షాపులను నిర్వహించాలన్నారు. తమకు అనుకూలంగా ఉందని ఎక్కడపడితే అక్కడ షాపులను ఏర్పాటు చేసుకొని కార్డుదారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షాప్ వద్ద నోటీస్ బోర్డు స్టాక్ వివరాలు ఇతరత్రాలను తప్పక ఏర్పాటు చేయాలన్నారు. కార్డుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన పనివేళల్లో నిత్యవసరాలు పంపిణీ చేయాలన్నారు. ఇకపై ప్రతినెలా ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలు ఉంటాయని స్టాక్‌లో వ్యత్యాసాలు ఉంటే కేసులు నమోదు చేయడం జరుగుతుందని కాబట్టి పారదర్శకంగా పంపిణీ చేయాలని తెలిపారు. అనంతరం డీలర్ల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డీలర్ల సంఘం నాయకులు నరేంద్ర, విశ్వనాథరెడ్డి, సనావుల్లా,లియాకత్, ముని కృష్ణయ్య, జుబేర్, జిలాని, యువరాజు, గోవిందు, రెడ్డెప్ప తదితరులున్నారు.

విద్యను వ్యాపారం చేస్తున్న 'శ్రీ చైతన్య'ను సీజ్ చేయాలి

ప్రజాశక్తి- పుంగనూరు: పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేర్లతో పేదవిద్యార్థుల దగ్గర నుండి లక్ష రూపాయలు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలపైన వెంటనే చర్యలు తీసుకోవాలని, సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రవీణ్ కుమార్, రాష్ట్ర సమితి సభ్యులు మున్నా దీమాండ్ చేశారు. పుంగనూరు పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో ఆవరణంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి అంతులేకుండా పోయిందని అన్నారు. లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నా ఎక్కడా విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పాఠశాలల పైన వెంటనే చర్యలు తీసుకోని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. నాయకులు గోపీచంద్, హుస్సేన్, గిరిధర్, శేఖర్, అఖిల్‌పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ నకిలీ బంగారం కేసులో

ఐదుగురు అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని ఎద్దులసంత రోడ్డులోని గల కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ నకిలీ బంగారు కేసులో నగలు తాకట్టు పెట్టి రుణాలు పొందిన కేసుకు సంబంధించి పోలీసులు ఐదు మందిని బుధవారం అదుపులోకి తీసుకున్న ముద్దాయిలు పేర్లు 1. భాను ప్రకాష్, 2. శంకరయ్య, 3. నరేష్ కుమార్, 4. గణేష్, 5. బోసు రెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపడం జరిగింది. పలమనేరు సీఐ నరసింహరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రైవేటు బ్యాంకులో పనిచేసే సిబ్బందే నకిలీ బంగారు నగలు తయారు చేయించి బ్యాంకులో రుణం కోసం తాకట్టు పెట్టి, నకిలీ చిరునామాలతో నగదు తీసుకుని స్వాహా చేశానట్లు తెలిపారు. గతేడాది ఆడిట్లో ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగారని, పలమనేరు, పుంగనూరు బ్రాంచుల్లో మొత్తం రూ.8.9 కోట్ల వరకు రుణాలు పొందిన వ్యవహారం వెలుగు చూసిందని తెలిపారు. ఈ ఏడాది మార్చిలో ఈ కేసుకు సంబంధించి 8 మందిని పోలీసులు అరెస్టు చేయగా అదే కేసుకు సంబంధించి కొన్ని లావాదేవీలను గమనించి మరికొందరిని పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. సమగ్రంగా విచారించి కచ్చితమైన నిర్ధారణకు వచ్చిన తరువాత గురువారం వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్ పంపుతున్నట్లు తెలియజేశారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని కాట్టప్పగారిపల్లి వద్ద చోటు చేసుకుంది.

ఎస్సై ప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు రూరల్ మండలం మురుకంబట్టు కోడిగుంతపల్లికి చెందిన చంద్రశేఖర్ నాయుడు ఆయన కుమారుడు యోగేష్ ట్రాక్టర్‌లో మామిడి కాయలను మార్కెట్‌కు తరలించి తిరుగు ప్రయాణంలో వెళుతుండగా కాట్టప్పగారిపల్లి వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను బెంగళూరు నుండి చిత్తూరుకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి (62) అక్కడికక్కడే మృతి చెందాడు. యోగేష్‌కు స్వల్ప గాయాలు కాగా ప్రథమ చికిత్స ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

వన్‌టౌన్ పరిధిలో రెండు కేసులు నమోదు

11 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు పరిధిలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని రాంనాగర్ కాలనీలో వ్యభిచారగృహం నడుపుతున్న నిర్వాహకురాలిని, విటులను అరెస్ట్ చేశారు. సంతపేటలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి రూ.40 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ఉమామహేశ్వర్ తెలిపారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీ బీ-క్రాస్‌లోని ఒక ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచారగృహంగా మలిచినట్టు సమాచారం వచ్చిందని, దీనిపై ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ మహేశ్వర, డీఎస్పీ ప్రొసీడింగ్స్ తీసుకుని సంబంధిత ఇంటిపై దాడి నిర్వహించారు. ఈ తనిఖీలో సుమతి అనే మహిళ నిర్వాహకురాలిగా ఉండగా ఆమెతో పాటు ఇంకా ఇద్దరు మహిళలు, నలుగురు విటులు కూడా అక్కడ వ్యభిచార చర్యలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ కావడంతో వారందరినీ అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేశారు అలాగే చిత్తూరు సంతపేట ప్రాంతంలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం వచ్చిందని వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీ చేసినప్పుడు 11 మంది వ్యక్తులు పేకాట ఆడుదున్న అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ. 40,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ గహాన్ని శ్యామ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు గుర్తించి అతనిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

కంచర్ల రామయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి అయినా కంచర్ల రామయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్ నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం తుది శ్వాసవిడిచినట్టు తెలిపారు. ఆయన మరణవార్త తెలుసుకున్న ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కుప్పం మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్ కుమార్, శాంతిపురం మండల అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాజారామ్, కడా కమిటీ సభ్యులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోజురోజుకూ పెరుగుతున్న వైసిపి దౌర్జన్యాలు

టిటిడి పాలక మండలి సభ్యులు శాంతారామ్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలో వైసీపీ దౌర్జన్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని టిడిపి నాయకులు మండిపడ్డారు. గురువారం కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి భరత్ స్థానికంగా గూండాలను, రౌడీ షీటర్‌లను పెంచి పోషిస్తూ అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీ కార్యకర్త నజ్మా దాడి జరిగి 24 గంటలు పూర్తి అవుతున్న ఇంతవరకు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి నోరు తెరవకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. దాడికి పాల్పడ్డ వ్యక్తిని వెంటనే వైసీపీ నుంచి సస్పెండ్ చేసి, మహిళలకు న్యాయం చేయాలని, రౌడీ షీటర్‌లతో వీడియోలు పెట్టించినంత మాత్రాన నిజం అబద్ధంగా మారిపోదన్నారు. కార్యక్రమంలో బాధితురాలి భర్త అమ్జత్, రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సి.మణి, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ గఫార్, మండల మహిళా అధ్యక్షురాలు వసంతమ్మ, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.